సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం | 4 | అక్టోబర్ | 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 28 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం

36.7°/22.3°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

శ్రీవారి హుండీ కానుకల లెక్కింపు

- రూ. 84.63 లక్షల ఆదాయం



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు గత 53 రోజుల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించినట్లు ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. రూ.84.63 లక్షల నగదు, 154 గ్రాముల బంగారు, వెండి 2 కేజీల 300 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. విదేశీ కరెన్సీ కూడా భక్తులు సమర్పించారని, అందులో అమెరికన్ డాలర్లు 195, కెనడా- 40, స్విట్జర్లాండ్- 60, ఒమన్ -1, రియాద్ 55 ఉన్నట్లు వివరించారు. గతం కంటే ఈ సారి ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు చెప్పారు. హుండీల పర్యవేక్షణాధికారి నరసింహరాజు, కెనరా బ్యాంక్ మేనేజర్ మధుసూదన్, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కామాంధుడికి పదేళ్ల జైలు

- పోక్సో కేసులో శిక్ష



గాండ్లపెంట: పోక్సో కేసులో ఓ కామాంధుడికి 10 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన మేరకు..మండల పరిధిలోని సోమయాజులపల్లి పంచాయతీ ఎర్రజేనుపల్లి గ్రామానికి చెందిన ఇరగదిండ్ల గంగరాజు.. 2020 మేలో అదే గ్రామానికి చెందిన ఓ 7 సంవత్సరాల బాలికపై అత్యాచారానికి యత్నించాడు. చాక్లెట్లు, బిస్కెట్లు ఇస్తానని మాయ మాటలు చెప్పి స్థానికంగా ఉండే ఓ పాడు బడిన ఇంటి వెనకాల వైపు తీసుకెళ్లి బాలికను వివస్త్రను చేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల మేరకు అప్పట్లో మండల ఎస్‌ఐగా ఉన్న గురుప్రసాద్‌రెడ్డి ఐపీసీ సెక్షన్ 7,8 రెడ్ విత్ 511 కింద కేసు నమోదు చేశారు. అనంతపురంలోని పోక్సో కోర్టులో ఈ కేసు విచారణ మంగళవారం జరిగింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విద్యావతి వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి రాజ్యలక్ష్మీ నిందితునికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. తగిన సాక్ష్యాధారాలు చూపి నిందితుడికి శిక్ష పడేలా చేసిన అప్పటి ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి, కానిస్టేబుల్ మధుసూదన్‌ను ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు. తప్పు చేసిన వారికి శిక్ష పడేలా ప్రతి పోలీసు అధికారి పనిచేయాలన్నారు.

'పది' పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

పుట్టపర్తి అర్బన్: 'పది' ఫెయిల్ అయిన విద్యార్థులు 2024 మార్చిలో జరిగే పరీక్షలు రాసేందుకు ఫీజు చెల్లింపు గడువును ఈనెల 10 వరకు పొడిగించారు. ఈ మేరకు డీఈఓ మీనాక్షి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మూడు కంటే తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మైగ్రేషన్ పత్రం కోసం రూ.80 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అపరాధ రుసుం లేకుండా 10వ తేదీ వరకు చెల్లించవచ్చని, రూ.50 అపరాధ రుసుంతో 11 నుంచి 16 వరకు, రూ.200 అపరాధ రుసుంతో 17 నుంచి 23వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో 24 నుంచి 30వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. www. bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా స్కూల్ లాగిన్‌లో మాత్రమే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

2.63 లక్షల పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న కంబాలపర్తి వలంటీర్ రాజు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో మంగళవారం నాటికి 2.63 లక్షల పింఛన్లు పంపిణీ చేశారు. 2,73,975 మంది లబ్ధిదారుల్లో 2.63 లక్షల మందికి రూ.73,04,39,750 పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. మరో రెండు రోజులు పింఛన్ పంపిణీ ఉంటుందన్నారు.

కిడ్నీ రోగుల కల్పవృక్షం

- హిందూపురం ఆస్పత్రిలో భేమ్మగ్గా డయాలసిస్ సేవలు
- రోజూ దాదాపు 90 మందికి రక్త శుద్ధి
- రూ.వేలు ఖర్చయ్యే ప్రక్రియ ఉచితంగా
- సర్కారు చర్యలతో పేదలకు సాంత్వన
- రూ.10 వేల పెన్షన్‌తో మరింత మేలు



హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రంలో రక్తశుద్ధి చేసుకుంటున్న బాధితులు

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఒకసారి డయాలసిస్‌కు అయ్యే ఖర్చు రూ. 4 నుంచి 5 వేలు
జిల్లాలో డయాలసిస్ రోగులు: 130
ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ : రూ. 10 వేలు
నెలలో ఖర్చు చేస్తున్న మొత్తం : రూ. 13 లక్షలు

హిందూపురం: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కిడ్నీ బాధితులకు కల్పతరువుగా మారింది. రోజూ దాదాపు 90 మందికి డయాలసిస్ సేవలు అందిస్తోంది. ఆస్పత్రిలోని ప్రత్యేక డయాలసిస్ విభాగంలో 20 నెగెటివ్, రెండు పాజిటివ్ యంత్రాల ద్వారా షిఫ్ట్‌కు 75 మంది లెక్కన రోజుకు నాలుగు షిఫ్ట్‌లుగా రోగులకు రక్తశుద్ధి ప్రక్రియ కొనసాగుతోంది. ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకూ వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. షిఫ్ట్‌ల ప్రకారం 20 మంది దాకా విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఇద్దరు డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు, సెంట్రల్ మేనేజర్ ఒకరు, నెఫ్రాలాజిస్ట్ ఒకరు, డైటీషన్ ఒకరు, టెక్నికల్ సిబ్బంది 12 మంది, హౌస్ కీపింగ్ ముగ్గురు చొప్పున రోగులకు సేవలందిస్తున్నారు.

అత్యాధునిక సదుపాయాలు..

ప్రైవేటుగా డయాలసిస్ చేయించుకోవాలంటే సాధారణంగా రూ. 4 వేల నుంచి 5 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పేద రోగుల ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా డయాలసిస్ సేవలు పొందే సదుపాయం తీసుకొచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా చర్యలు తీసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. పేద వర్గాలను దృష్టిలో ఉంచుకుని డయాలసిస్ యూనిట్‌కు అత్యాధునిక సదుపాయాలు సమకూర్చారు. పెద్ద సంఖ్యలో వైద్య సిబ్బందిని అందుబాటులోకి తీసుకొచ్చారు. హిందూపురం ఆస్పత్రిలోని డయాలసిస్ యూనిట్‌లో అరకొర సౌకర్యాలతో గతంలో 10-15 మంది రోగులే సేవలు పొందేవారు. వైఎస్సార్ సీపీ సర్కారు చర్యలతో నేడు నిత్యం దాదాపు 90 మంది దాకా సేవలు పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటకలోని గౌరీబిదనూరు, బాగేపల్లి ప్రాంతాల నుంచి కూడా రోగులు వచ్చి ఇక్కడ డయాలసిస్ చేయించుకుంటుండడం గమనార్హం.

పెన్షన్‌తో చేయూత

ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పెన్షన్ సదుపాయం కూడా ప్రభుత్వం కల్పించింది. ప్రతి నెలా రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రయివేట్‌గా డయాలసిస్ చేయించుకున్నా ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ఈ సదుపాయం కల్పించారు.

డయాలసిస్ అంటే..

కిడ్నీల సమస్య ఉంటే రక్త శుద్ధికి ఆటంకం కలుగుతుంది. దీంతో కృత్రిమ రక్తశుద్ధి అనివార్యమవుతోంది. దీన్నే డయాలసిస్ అంటారు. మూత్రపిండాల సమస్యలున్న వారు మూడు రోజులు, వారం, నెలలో ఒకటి లేదా రెండు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది.

రోజూ డయాలసిస్ చేయించుకుంటున్నా..



హిందూపురం జిల్లా ఆస్పత్రిలో రోజూ డయాలసిస్ చేయించుకుంటున్నా. ఇక్కడి వైద్య సిబ్బంది ఎంతో ఓపికగా సేవలందిస్తున్నారు. గతంలో కంటే ఆస్పత్రితో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. పేదలకు సేవలు బాగా అందుతున్నాయి.

– రంజిత్‌కుమార్, కొడికొండ చెక్‌పోస్టు, చిలమత్తూరు

రూపాయి ఖర్చు చేయట్లేదు



కిడ్నీ సమస్య కారణంగా వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయించుకుంటున్నా. రూపాయి ఖర్చులేకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో సదుపాయం కల్పించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేల ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– గోపికృష్ణ, ఆర్టీసీ కాలనీ, హిందూపురం

అత్యాధునిక మిషన్లతో సేవలు



ఆస్పత్రిలో అత్యాధునిక మిషన్ల ద్వారా రోగులకు సేవలు అందిస్తున్నాం. కిడ్నీ ఫెయిల్యూర్ శాతాన్ని నెఫ్రాలజిస్ట్ నిర్ణయిస్తారు. ఒక్కోసారి పాముకాటు, ఇతర సర్జరీల వల్ల కూడా సమస్య రావచ్చు. కాలు వాపు రావడం, నీరసంగా ఉండటం, ఆయాస పడటం, వాంతులు, హిమోగ్లోబిన్ లెవల్స్ తగ్గిపోవడం కిడ్నీ వ్యాధి సంకేతాలు.

– సయ్యద్ ఫాతిమా, డయాలసిస్ వైద్యులు, హిందూపురం

పక్కడ్బందీగా అట్రాసిటీ చట్టం అమలు

- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెనుకొండలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన శ్మశాన వాటికకు స్థల సేకరణ రెండు రోజుల్లో పూర్తి చేస్తామని, తనకల్లు గిరిజన బాలికల వసతి గృహం వద్ద ప్రహరీ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. 34 అట్రాసిటీ కేసుల్లో రూ.83 లక్షల ఆర్థిక పరపతి కల్పించినట్లు చెప్పారు. కాలనీల్లో ఎక్కడా కల్లు దుకాణాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ తనకల్లు గిరిజన బాలికల వసతి గృహం వద్ద ప్రత్యేకంగా మహిళా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపడతామన్నారు. అనంతరం పలు సమస్యలను మానిటరింగ్ కమిటీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్, ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డ్రాఫ్ట్ పబ్లికేషన్ పక్కాగా రూపొందించాలి

తప్పులు లేకుండా పక్కాగా డ్రాఫ్ట్ పబ్లికేషన్ రూపొందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఓటర్ల జాబితాను రూపొందించాలని ఆదేశించారు. అనంతరం పుట్టపర్తి కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు ఆర్డీఓలు, ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం 6,7,8 దరఖాస్తులు 90 శాతం పరిష్కరించామన్నారు. తక్కిన క్లెయింలను పరిష్కరించి డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమర్పించిన క్లెయింలు, చనిపోయిన, డూప్లికేట్, బదిలీ చేయబడిన, నకిలీ ఓటర్ల వెరిఫికేషన్, ఎపిక్ కార్డుల జనరేషన్ తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పట్నంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్

- నేడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్న సీఎం జగన్



మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కానున్న స్థలం

కదిరి అర్బన్: కదిరి మండలం పట్నం గ్రామంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బుధవారం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ. 4.41 కోట్లతో పట్నం బైపాస్ రోడ్డు సమీపంలో యూనిట్ నిర్మించనున్నారు. ఇప్పటికే అర ఎకరం భూమిని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి కేటాయించారు.

రైతులకు మేలు..

పట్నంలో నెలకొల్పనున్న యూనిట్‌లో చిరుధాన్యాలు ప్రాసెసింగ్ చేస్తారు. వాటి నుంచి బిస్కెట్లు, తినుబండారాలు తయారు చేస్తారు. యూనిట్ ఏర్పాటైతే చిరుధాన్యాలు పండించే వందలాది రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణంగా రైతులు తమకు వచ్చే ఆదాయంలో 10 నుంచి 20 శాతం వరకు పంటను మార్కెట్‌కు తరలించేందుకు అయ్యే రవాణా, కమీషన్ రూపంలోనే కోల్పోతుంటారు. సరిగా శుద్ధి చేయక మార్కెట్‌లో పంట ఉత్పత్తులకు తగిన ధర కూడా లభించదు. అయితే, ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రైతులు ఈ నష్టాన్ని పూడ్చుకునేందుకు అవకాశం ఉంటుంది. మార్కెట్ ధర కంటే 30 శాతం అదనంగా లబ్ధి చేకూరుతుంది. పట్నంలో ఏర్పాటు కానున్న మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌తో జిల్లాలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరగనుంది. రైతులకు మంచి ఆదాయం లభించనుంది.

రైతులకు భరోసా



మా ప్రాంతంలో వర్షపాతం తక్కువ. వరి పంటకు నీరు ఎక్కువగా కావాలి. వర్షాలు సకాలంలో కురవక వేరుశనగ సాగు చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి. దీంతో చాలామంది తక్కువ నీటి సౌకర్యంతో సాగు చేసే చిరుధాన్యాల వైపు మళ్లారు. లాభాలు తక్కువైనా సాగు చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనుండడంతో అన్నదాతలకు భరోసా లభిస్తుంది.

– చలపతినాయక్, సర్పంచ్, పట్నం

రాగి సాగు పెంచుతా



నేను రెండెకరాల్లో రాగులు పండిస్తాను. మార్కెట్‌కు తరలించేందుకు ఇన్నాళ్లు ఇబ్బంది పడాల్సి వచ్చేది. అయితే, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో ఆ సమస్యలు తప్పుతాయి. ప్రభుత్వ చర్యలతో జిల్లాలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరుగుతుంది. తద్వారా రైతులకు ఆదాయం లభిస్తుంది. నేను కూడా మరింత విస్తీర్ణంలో చిరుధాన్యాలు సాగు చేస్తా.

– రాజారెడ్డి, రైతు, చిప్పలమడుగు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



పుట్టపర్తి బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న ఈడీ వెంకటేశ్వర్‌రావ్

పుట్టపర్తి టౌన్: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఈడీ వెంకటేశ్వర్‌రావ్ ఆదేశించారు. పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చి ఆర్టీసీ ఆదాయం పెంచాలన్నారు. అవకతవకలకు తావివ్వకుండా దుకాణాల టెండర్లు నిర్వహించాలన్నారు. కార్గో సేవలు విస్తృతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీటీఓ మధుసూదన్, సూపర్‌వైజర్లు ఖాజావలి, షాషావలి, డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్టీఐ పెద్దన్న, ఎంసీ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

టెంట్ ఎత్తేశారు..!



మంగళవారం సాయంత్రానికి కానరాని టెంటు

హిందూపురం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ నాయకులు చేస్తున్న ఆందోళనలకు జనం ఆదరణ కరువైంది. తూతూమంత్రంగా వస్తూ పోతున్న నాయకులు, కార్యకర్తలు కూడా రావడం మానేశారు. దీంతో హిందూపురంలో నిరసన దీక్ష కోసమంటూ ఏర్పాటు చేసిన టెంటును ఎత్తేశారు. మంగళవారం జనసేన నాయకులను దీక్షకు కూర్చోబెట్టినా.. వారు కూడా కొంతసేపటికే వెళ్లిపోవడంతో చేసేది లేక తట్టా బుట్టా సర్దుకున్నారు.



ఉదయం శిబిరంలో టీడీపీ, జనసేన నాయకులు

ఆముదం.. రైతన్న ఆమోదం!

- ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంటగా గుర్తింపు
- అధికారుల అంచనాకు మించి సాగు



వేపకుంట గ్రామంలో ఆముదం పంటను పరిశీలిస్తున్న జిల్లా శాస్త్రవేత్తలు (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: పదేళ్ల కిందట వరకు రైతులకు పెద్దగా పరిచయం లేని ఆముదం ఇటీవల ప్రధాన పంట జాబితాలోకి చేరింది. గతంలో కేవలం అక్కడక్కడా ఎరపంటగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగైదు వేల ఎకరాలకు మించి సాగు చేయని పరిస్థితి. ప్రస్తుతం వందలు, వేల ఎకరాల్లో సాగు చేస్తుండడం గమనార్హం. ఏకపంటగా విస్తరించిన వేరుశనగను బాగా తగ్గించేసి దాని స్థానంలో కంది, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలపై దృష్టి సారించారు. ఈ జాబితాలో ఆముదం కూడా చేరడంతో ప్రధాన పంటగా మారింది. కనగానపల్లి మండలం వేపకుంట లాంటి కొన్ని గ్రామాల్లో అయితే 70 నుంచి 80 శాతం మంది రైతులు కేవలం ఆముదం పంట సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రామగిరి, ఆత్మకూరు, రాప్తాడు, కనగానపల్లి, గుంతకల్లు, వజ్రకరూరు, గార్లదిన్నె, కూడేరు, తాడిపత్రి, గుత్తి, బెళుగుప్ప, రొద్దం, బుక్కరాయసముద్రం, అనంతపురం, పెద్దపప్పూరు, యల్లనూరు, యాడికి, ముదిగుబ్బ, ధర్మవరం, బత్తలపల్లి, ఉరవకొండ తదితర ప్రాంతాల్లో ఇటీవల పంట విస్తీర్ణం బాగా పెరుగుతోంది.

సర్కారు తోడ్పాటు..

వ్యవసాయ పరిశోధనా స్థానం అభివృద్ధి చేసిన కొత్త వంగడాలను అందుబాటులోకి తేవడంతో ఆముదం సాగుకు రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. మోస్తరు వర్షాలు వచ్చినా తక్కువ పెట్టుబడితో అంతో ఇంతో పంట చేతికి వస్తుందని రైతులు నమ్ముతున్నారు. ఎకరాకు ఐదారు క్వింటాళ్ల దిగుబడులు వస్తుండటం, క్వింటా రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు పలికిన దాఖలాలు ఉండటంతో సాగు విస్తీర్ణం పెరుగుతున్నట్లు చెబుతున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్ష ఎకరాలకు పైగా ఆముదం సాగైనట్లు అంచనా వేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు మొట్టమొదటి సారిగా ఆముదం పంటను వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంలోకి చేర్చడంతో రైతుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. పంట దిగుబడుల ఆధారంగా బీమా వర్తింపజేశారు. భవిష్యత్తులో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కూడా ప్రకటించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

నేడు వేపకుంట, సనపలో శాస్త్రవేత్తల బృందం ఫీల్డ్‌డే..

భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్)కు చెందిన ఏపీ, తెలంగాణాల నుంచి శాస్త్రవేత్తల బృందం బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్నట్లు బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ రాధిక, డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి సాక్షికి తెలిపారు. ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ కేఆర్ మాథూర్ నేతృత్వంలోని డాక్టర్ సి.లావణ్య, డాక్టర్ జీడీ సతీష్‌కుమార్, డాక్టర్ జవహరలాల్ జాటోతు, డాక్టర్ టి.మంజునాథ్‌తో కూడిన బృందం బుధవారం ఉదయం 11 గంటలకు ఆత్మకూరు మండలం సనప గ్రామం, మధ్యాహ్నం 2.30 గంటలకు కనగానపల్లి మండలం వేపకుంట గ్రామాల్లో ఫీల్డ్‌డేలో పాల్గొంటారని తెలిపారు. ఆముదం పంట స్థితిగతులు, రైతుల అనుభవాలు, కొత్త వంగడాలు, ఉత్పత్తి, ఉత్పాదక శక్తి, ఆదాయం, లాభనష్టాల గురించి రైతులతో ముఖాముఖి ఉంటుందని తెలిపారు.

తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు

పుట్టపర్తి అర్బన్: ఓటరుగా నమోదు చేయడానికి, తొలగించడానికి తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌ఓ కొండయ్య ఓ ప్రకటనలో హెచ్చరించారు. తొలగింపుల విషయంలో ఎన్నికల సిబ్బందికి ఫారం 6,7లో తప్పుడు సమాచారం ఇస్తే సెక్షన్ 31 (బీ) చట్టం 1950 మేరకు జరిమానాతో పాటు ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తారన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన యువత ఓటరుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు.

చాకర్లపల్లి రైల్వే గేటు మూసివేత

సోమందేపల్లి: రైల్వే ట్రాక్ పనుల దృష్ట్యా మండలంలోని చాకర్లపల్లి రైల్వే గేటును మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకూ గేటు తెరవమన్నారు. హిందూపురం-అనంతపురం వైపు రాకపోకలు జరిపేవారు పాలసముద్రం వైపు నుంచి వెళ్లాలని తహసీల్దార్ సురేష్ కుమార్, ఎస్ఐ విజయ్‌కుమార్ సూచించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు పెడపల్లి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు పుట్టపర్తి మండలం పెడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పాఠశాల హెచ్ఎం రామచంద్రారెడ్డి, పీడీ సూర్యనారాయణ మంగళవారం తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచి అండర్ 17 వాలీబాల్ విభాగంలో విష్ణువర్ధన్, అండర్ 17 హాకీ విభాగంలో భవ్యశ్రీ, అండర్ 14 హాకీ పోటీలకు చరణ్ ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు చెన్నకృష్ణారెడ్డి, విష్ణువర్ధన్, సోమశేఖరరాజు తదితరులు అభినందించారు.

పాముకాటుతో రైతు మృతి

అమడగూరు: మండలంలోని కందుకూరిపల్లికి చెందిన రైతు రామచంద్ర (47) పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... మంగళవారం ఉదయం పశువుల మేత కోసం పొలంలో గడ్డి కోస్తున్న రామచంద్రను పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే కదిరిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జర్నలిస్టుల రాష్ట్ర స్థాయి షటిల్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, పాత్రికేయులు

పుట్టపర్తి టౌన్: ఈ నెల 14, 15 తేదీల్లో వైఎస్సార్ జిల్లా పులివెందుల వేదికగా జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి షటిల్ టోర్నీకి సంబంధించిన పోస్టర్లను ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యం ఒత్తిడిలో ఉండే జర్నలిస్టులకు క్రీడలు ఎంతో ఉపశమనం కలిగిస్తాయన్నారు. జర్నలిస్టుల క్రీడల నిర్వహణకు పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాప్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, జర్నలిస్టులు శ్రీనివాసులు, శర్మ పాల్గొన్నారు.

క్యాబేజీ సాగు... లాభాలు బాగు

వ్యవసాయం నేడు కొందరికి అభిరుచిగా మారింది. ఎంతో ఇష్టంగా పంటలు సాగు చేసేందుకు యువరైతులు ముందుకు వస్తున్నారు. సరికొత్త ఆలోచనలు అమలు చేస్తూ కొంగొత్త పంటలను పరిచయం చేస్తున్నారు. ఆధునిక సేద్యపు విధానాలు అందిపుచ్చుకుని సాగులో అద్భుతాలను ఆవిష్కరిస్తున్నారు. ఈ కోవకే చెందిన వాడే మడకశిర నియోజకవర్గం రొళ్ల మండలం కాకి గ్రామానికి చెందిన రైతు మోహన్. గత రెండు, మూడేళ్లుగా క్యాబేజీని పండిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. సేద్యంలో నష్టాలే ఉంటాయనుకుంటున్న ప్రస్తుత రోజుల్లో కొత్త పంటలతో ఆర్థికాభివృద్ధిని ఎలా సాధించాలో అన్నదాతలకు ప్రత్యక్షంగా చూపిస్తున్నాడు.

- కరువు నేలలో బంగారు పంట పండిస్తున్న యువరైతు
- ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో ఎకర విస్తీర్ణంలో క్యాబేజీ సాగు
- ఏడాదికి మూడు పంటలు... ప్రతి పంటకూ 25 టన్నుల దిగుబడి
- ఖర్చులు పోనూ రూ.6 లక్షల వరకూ ఆదాయం



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన క్యాబేజీ



క్యాబేజీ పంటలో కలుపు తీస్తున్న దృశ్యం

రొళ్ల: ఇష్టంతో చేసే పని ఏదైనా... సత్ఫలితాన్ని ఇస్తుందని నమ్మిన కాకి గ్రామానికి చెందిన యువరైతు మోహన్.. తన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వ్యవసాయం చేపట్టారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక విధానాలను అందిపుచ్చుకుని వాణిజ్య పంటల సాగుతో అధిక లాభాలు గడిస్తున్నారు.

కర్ణాటక నుంచి నారు తెచ్చి

అందరిలాగానే సంప్రదాయ పంటలు సాగు చేస్తూ నష్టాలు చవిచూసిన మోహన్... రెండుమూడేళ్లుగా ఉన్న కొద్ది పాటి నీటితోనే క్యాబేజీ సాగు చేపట్టారు. ఈ పంట సాగు చేసే ముందు కర్ణాటక ప్రాంతంలో అక్కడి రైతులు అవలంభిస్తున్న సాగు విధానాలపై పూర్తిగా అధ్యయనం చేశారు. అనంతరం తనకున్న 3.5 ఎకరాల్లో ఓ ఎకరా విస్తీర్ణంలో క్యాబేజీ సాగుకు సిద్ధమయ్యారు. పొలం దుక్కి, ఎరువులు, ఔషధాలు, ఇతరత్రాలకు దాదాపు రూ.65 వేలు ఖర్చు చేశారు. కర్ణాటక ప్రాంతం నుంచి 25 నుంచి 30 రోజుల వయసున్న 25వేల నారు మొక్కలను తీసుకువచ్చి పెంపకం చేపట్టారు. ఒక్కో నారుకు 50 పైసల నుంచి 75 పైసలు చొప్పున వెచ్చించారు. డ్రిప్ పద్ధతిలో సాగు నీటిని అందిస్తూ నారు నాటిన 90 రోజులకే తొలి పంటను చేతికి తీసుకున్నారు. ఇలా ఏడాదికి మూడు పంటల చొప్పున తీస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

క్యాబేజీ పంటకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో కర్ణాటకలోని చిక్కబళ్లాపురం, దొడ్డబళ్లాపురం, బెంగళూరు, కోలారు, తుమకూరుతో పాటు కోల్‌కత్తా, ముంబయి, పూణే వంటి నగరాలకు క్యాబేజీ పంటను రైతు మోహన్ ఎగుమతి చేస్తున్నారు. ప్రతి పంటకు 25 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ప్రస్తుతం 50 కిలోల బస్తా మార్కెట్‌లో రూ.500 నుంచి రూ.900 వరకు ధర పలుకుతోంది. ఖర్చులు పోనూ రూ.2 లక్షల వరకు లాభం చేతికి అందుతోంది. దీనికి తోడు మిగిలిన పొలంలో వక్క తోటలో అంతర పంటగా చేపట్టిన బ్యాడిగే మిరప ద్వారా అదనపు ఆదాయం సమకూరుతోంది.

ఇష్టంతోనే పంటల సాగు



ఏటా సంప్రదాయ పంటలు వేసి నష్టపోయా. దీంతో ఎకరా విస్తీర్ణంలో క్యాబేజీ పంట సాగు చేపట్టాను. ప్రస్తుతం వారం పది రోజుల్లో పంట కోతకు వస్తుంది. ఏడాదిలో మూడు పంటలు చేతికి అందుతాయి. ప్రతి కోతకు 25 టన్నుల వరకు దిగుబడి ఉంటోంది. మార్కెట్‌లో ధరను బట్టి ఖర్చులు పోగా ప్రతి పంటకు రూ.2 లక్షల వరకూ ఆదాయం వస్తోంది.

– రైతు మోహన్, కాకి గ్రామం, రొళ్ల మండలం

తుళు ప్రభువుల పాలన గొప్పది

- చరిత్రకారుడు మైనాస్వామి వెల్లడి



తుళువంశ శాసనం గురించి వివరిస్తున్న మైనాస్వామి

లేపాక్షి: తుళు ప్రభువుల పాలన చాలా గొప్పదని, రాజ్యాన్ని విస్తరించడానికి చోళ, పాండ్య, బహుమనీ సుల్తానులు, గజపతులు వంటి రాజులను ఓడించినట్లుగా ఇక్కడి శాసనాలు చెబుతున్నాయని చరిత్రాకారుడు మైనాస్వామి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం రెండవ ప్రాకార గోడలపై శాసనంగా చెక్కిన తుళు వంశ ప్రశస్తిని గుర్తించినట్లు వివరించారు. లేపాక్షిలోని అన్ని శాసనాలకంటే తుళు వంశ ప్రశస్తి చాలా పెద్దదిగా ఉందన్నారు. ఆలయ నిర్మాణానికి సాయపడిన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి అచ్యుతరాయలు క్రీస్తు శకం 1533లో ఈ శాసనాన్ని రాయించినట్లుగా తెలిపారు. లిపి కన్నడ కాగా అందులోని భాషా సంస్కృతమని పేర్కొన్నారు. అచ్యుతరాయలు కాలంలో ఉన్న సంస్కృత కవయిత్రి తిరుమలమ్మ ఆ శాసనాన్ని రూపొందించినట్లుగా తెలుస్తోందన్నారు. పురాణ ప్రభువులు బుధుడు, పురూరవుడు, తురువసుడు, యయాతి తదితరులు తమ వంశానికి మూల పురుషులని అచ్యుతరాయలు పేర్కొన్నట్లుగా అందులో ఉందన్నారు. తిమ్మభూపతి, దేవకిదేవి, ఈశ్వరనాయకుడు, ముక్కమాంబ, నరసనాయకుడు, తిప్పాంబ, నాగలాంబ, ఓబాంబ, నరసింహరాయులు, శ్రీకృష్ణదేవరాయల తదితర పేర్లు సైతం శాసనంలో ఉన్నాయన్నారు. విజయనగర సామ్రాజ్యంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు తిరుమల, హంపి, శ్రీకాళహస్తి, కంచి, శ్రీరంగం కుంభకోణం, శ్రీశైలం, మహానంది, హరిహర, గోకర్ణ, లేపాక్షి తదితర ఆలయాలకు భూములను, బంగారం విరివిగా దానం చేసినట్టు శాసనం ద్వారా అచ్యుతరాయలు వెల్లడించారన్నారు. భూములు, సువర్ణదానంతో పాటు వేలాది గోవులను ఆలయాలకు బహూకరించినట్లుగా అందులో ఉందన్నారు.

మిత్రుడి కుమార్తెపై అత్యాచారయత్నం!

- నాలుగేళ్ల తర్వాత దిశ పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు
- నిందితుడి అరెస్ట్... రిమాండ్‌కు తరలించిన పోలీసులు

అనంతపురం క్రైం: నాన్నతో కలసి ఆయన మిత్రుడు ఇంటికొస్తే ఆత్మీయంగా పలకరించి అన్నం పెట్టిన వివాహితపై కన్నేశాడు ఓ కామాంధుడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెపై అత్యాచారం చేయబోయాడు. గట్టిగా ప్రతిఘటించడంతో గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిన ఆ దుర్మార్గుడు.. చివరకు ఆమె భర్తకు దగ్గరై లోబర్చుకునేందుకు ఎత్తుగడ వేశాడు. దీంతో విషయం కాస్త భర్తకు తెలిసి భార్యకు దూరమయ్యాడు. పండంటి కాపురం కూలిపోయాక అసలు విషయాన్ని దిశ పోలీసులో బాధితురాలు మొరబెట్టుకుంది. వివరాలు...

అనంతపురంలోని లక్ష్మీనగర్‌కు చెందిన ఓ కుటుంబ పెద్దకు కరుడు కట్టిన నేరస్తుడు టెంకాయల రాము స్నేహితుడు. ఈ స్నేహాన్ని అడ్డుపెట్టుకుని తరచూ వారి ఇంటికి రాము వెళ్లేవాడు. ఈ క్రమంలోనే ఆ కుటుంబంలోని యువతికి తల్లిదండ్రులు పెళ్లి చేసి, అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నారు. అయితే స్నేహితుడి కుమార్తెపై కన్నేసిన రాము.. ఎలాగైనా ఆమెను లోబర్చుకోవాలని అవకాశం కోసం ఎదురు చూస్తూ వచ్చాడు.

2018లో ఘటన

2018, డిసెంబర్ 14న ఉదయం వివాహిత భర్త పనిపై బయటకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంటికి చేరుకున్న టెంకాయల రాము... ఆమె ఒంటరిగా ఉన్నట్లు నిర్ధారించుకుని, తనకు మంచి నీళ్లు కావాలని అడిగాడు. నీళ్లు తెచ్చి ఇచ్చిన ఆమె ఫోన్ కోసం పడకగదిలోకి వెళ్లగా వెనుకనే అనుసరించిన రాము బలాత్కరించబోయాడు. ఆ సమయంలో ఆమె గట్టిగా ప్రతిఘటించడంతో అక్కడి నుంచి ఉడాయించాడు. బయటకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి చేరుకున్న తర్వాత జరిగిన విషయం మొత్తం వారితో బాధితురాలు చెప్పుకుని ఏడ్చింది. అయితే రాము కరుడు కట్టిన నేరస్తుడు కావడంతో విషయం వివాదస్పదమైతే తమ ప్రాణాలకే ప్రమాదమని భావించిన కుటుంబసభ్యులందరూ బయటకు చెప్పుకోలేక లోలోనే మదనపడుతూ వచ్చారు. ఈ విషయం భర్తకు తెలిస్తే ఆయన ఎక్కడ అపార్థం చేసుకుని దూరమవుతాడోననే భయం కూడా వారిని వెన్నాడుతూ వచ్చింది.

విషయం తెలిసి దూరమైన భర్త

ఎలాగైనా స్నేహితుడి కుమార్తెను లోబర్చుకోవాలనుకున్న రాము.. చివరకు ఆమె భర్తకు సన్నిహితమవుతూ వచ్చాడు. ఇటీవల ఈ విషయాన్ని గమనించిన ఆమె వెంటనే తన భర్తను హెచ్చరిస్తూ రాముతో కలసి తిరగడం మంచిది కాదని హితవు చెప్పింది. రాము చేసిన దురాగతాన్ని తల్లిదండ్రులతో కలసి వివరించింది. ఆపత్కాలంలో బాధితురాలికి అండగా నిలవాల్సిన భర్త ఆమెను అపార్థం చేసుకున్నాడు. ఆ రోజునే ఆమెకు దూరమయ్యాడు. నీచుడి ప్రవర్తన కారణంగా తన సంసారం కుప్పకూలడంతో తీవ్ర వేదనకు లోనైన బాధితురాలు గత నెల 25న దిశ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఐ చిన్నగోవిందు... సిబ్బంది సాయంతో మంగళవారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా తలుపులలో టెంకాయల రామును గుర్తించి అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.


యువకుడి దుర్మరణం



ప్రకాష్ (ఫైల్)

రాయదుర్గంటౌన్: గుర్తు తెలియని వాహనం దూసుకెళ్లిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గంలోని వాల్మీకి నగర్‌కు చెందిన గురుమూర్తి ఏకైక కుమారుడు ప్రకాష్ (23) కుటుంబసభ్యులతో కలసి బెంగళూరుకు చేరుకుని అక్కడే అట్టల తయారీ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. బంధువుల ఇంట శుభకార్యం ఉండడంతో రెండు రోజుల క్రితం రాయదుర్గంలోని స్వగృహానికి వచ్చాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పనిపై మంగళవారం సాయంత్రం 4 గంటలకు ద్విచక్రవాహనంపై వెళుతున్న ప్రకాష్‌ను బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా అదుపు తప్పి రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో వెనుకనే వేగంగా వస్తున్న వాహనం అతని మీదుగా దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా ముందుకెళ్లిపోయాడు. ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మెడికో అదృశ్యం



చైతన్య (ఫైల్)

పెద్దపప్పూరు: మండలంలోని కొట్టాలపల్లికి చెందిన పి.చైతన్య కనిపించడం లేదు. తల్లి యశోద ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, కర్నూలులోని మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్న చైతన్య ఇటీవల వినాయకచవితి పండుగకు ఇంటికి వచ్చాడు. మంగళవారం తెల్లవారుజాము మూడు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన చైతన్య తిరిగి రాలేదు. ఫోన్‌లో సంప్రదించేందుకు తల్లి ప్రయత్నిస్తే స్విచ్చాఫ్ అంటూ సమాధానం వచ్చింది. దీంతో బంధువులను, కుమారుడి స్నేహితులను ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. ఘటనపై యశోద ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు.

ధ్యానంతో ఆరోగ్యం పదిలం

- ఫైట్ మాస్టర్లు రామ్, లక్ష్మణ్



ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న ఫైట్ మాస్టర్లు రామ్, లక్ష్మణ్

ధర్మవరం అర్బన్: నిత్యం ధ్యానం చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఫైట్ మాస్టర్లు రామ్, లక్ష్మణ్ తెలిపారు. ధర్మవరం పట్టణంలోని సబ్ జైలులో ఖైదీలకు మంగళవారం ధ్యానంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన రామ్, లక్ష్మణ్‌లు మాట్లాడుతూ రోజూ ఉదయం, సాయంత్రం ధ్యానం చేస్తే రుగ్మతలు దూరమవుతాయన్నారు. నిబద్ధత, మాటలో స్పష్టత, చేసే పనిలో స్వచ్ఛత, మంచి వ్యక్తిత్వం అలవడుతాయన్నారు. ఖైదీలుగా తెలిసి, తెలియక తప్పు చేసి శిక్షను అనుభవించడం బాధాకరమైనా, తప్పును సరిదిద్దుకోవాలని సూచించారు. మనిషి జీవితంలో ధ్యానం ఎంతో కీలకపాత్ర వహిస్తుందన్నారు. అనంతరం ఖైదీలతో చెడు పనులు చేయమని ప్రతిజ్ఞ చేయించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ బ్రహ్మారెడ్డి, పిరమిడ్ ధ్యానకేంద్రం సభ్యులు బండి రాము, నార్పల శివ, సబ్‌జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి అండర్–19 ఎస్‌జీఎఫ్ ఎంపికలు

అనంతపురం: ఈ నెల 5వ తేదీ నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 19 విభాగంలో క్రీడాకారుల ఎంపిక చేపట్టనున్నారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 5వ తేది నుంచి 9వ తేదీ వరకూ ఎంపిక ప్రక్రియ ఉంటుంది. 2005, జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. పదో తరగతి మార్కుల మెమోపై ప్రిన్సిపాల్ సంతకం, అడ్మిషన్ నంబర్‌తో ఎంపికలకు హాజరు కావాలి. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఎస్‌జీఎఫ్ ఎంట్రీ ఫామ్‌తో హాజరుకావచ్చు. క్రికెట్ క్రీడకు సంబంధించి అనంతపురంలోని పీటీసీ మైదానంలో ఈ నెల 6వ తేదీ ఎంపికలు ఉంటాయి. అలాగే అనంతపురంలోని అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7న ఫెన్సింగ్, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్, రెజ్లింగ్, ఈ నెల 9న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జూడో, రోప్ స్కిప్పింగ్, రగ్బీ క్రీడల్లో ప్రతిభావంతులను ఎంపిక చేయనున్నారు.

అమెరికా సంస్కృతి ఎలా ఉంది?



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యార్థిని సౌమ్య, డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: మన సంస్కృతికి, అమెరికా సంస్కృతికి ఏమైనా తేడా గమనించారా? అంటూ ఇటీవల ప్రభుత్వం తరఫున అమెరికా పర్యటనకు వెళ్లొచ్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను రాప్తాడు కేజీబీవీ 9వ తరగతి విద్యార్థిని సౌమ్య ప్రశ్నించింది. ఇంగ్లిష్‌లో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన పది మంది ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమెరికా పర్యటనకు పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విదేశీ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన వారితో అక్కడి అనుభవాలను ఇతర విద్యార్థులతో పంచుకునేలా మంగళవారం అన్ని జిల్లాల విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లా నుంచి ఒక విద్యార్థిని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అనంతపురం నుంచి రాప్తాడు కేజీబీవీ 9వ తరగతి విద్యార్థిని ఆర్.సౌమ్య పాల్గొంది. డీఈఓ చాంబరులో డీఈఓ నాగరాజు, సమగ్రశిక్ష ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. అమెరికాలో ఐక్యరాజ్య సమితి కార్యాలయం, లిబర్టీ ఆఫ్ స్టాచ్యూ, వైట్‌హౌస్, వరల్డ్ బ్యాంక్ తదితర కార్యాలయాలను సందర్శించి వచ్చినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చిన విద్యార్థుల తో ఇంట్రాక్ట్ అయినట్లు వెల్లడించారు. జిల్లా విద్యార్థిని అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ... అక్కడి దేశస్తులు తమ ను బాగా రిసీవ్ చేసుకున్నారన్నారు. అక్కడ తమ అనుభవాలను పంచుకున్నారు. డీఈఓ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే ఇలాంటి కార్యక్రమాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన తొలిరోజు ప్రశాంతం

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష సహిత విద్య విభాగంలో ఖాళీగా ఉన్న రిసోర్స్ పర్సన్ పోస్టులకు దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన తొలిరోజు మంగళవారం ప్రశాంతంగా జరిగింది. సమగ్రశిక్ష జిల్లా కార్యాలయంలో ఈ ప్రక్రియ సాగింది. రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన జాబితా మేరకు తొలిరోజు ఎంఆర్ అభ్యర్థుల సర్టిఫికెట్లను ఎంఈఓలు, హెచ్ఎంల బృందాలు పరిశీలించాయి. మొత్తం 144 మంది అభ్యర్థులకు గాను 120 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను సమగ్రశిక్ష ఏపీసీ, డీఈఓ నాగరాజు, ఐఈడీ కోఆర్డినేటర్ షమా పరిశీలించారు. రెండోరోజు బుధవారం వీఐ/హెచ్ఐ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని డీఈఓ తెలిపారు. దరఖాస్తు సమయంలో సమర్పించిన సర్టిఫికెట్లు రెండుసెట్లు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ తీసుకురావాలని సూచించారు.

వివాదాస్పద స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని బత్తలపల్లిలో కూల్చివేసిన అంగన్‌వాడీ కేంద్రం స్థలంలో మంగళవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అధికారుల అనుమతి లేకుండానే అంగన్‌వాడీ కార్యకర్త ఆ భవనాన్ని కూల్చి, శిథిలాలను మాయం చేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు వీఆర్వో నాగరాజు, వీఆర్ఏలు గంగాద్రి, చంద్రశేఖర్, స్థానికులు మంగళవారం అక్కడకు చేరుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కాగా, అంగన్‌వాడీ కేంద్రం కూల్చివేతకు ఉపయోగించిన జేసీబీ, శిథిలాలను మాయం చేసేందుకు వినియోగించిన ట్రాక్టర్ కోసం ఆరా తీస్తున్నట్లు కేసు దర్యాప్తు చేపట్టిన పుట్టపర్తి రూరల్ ఎస్ఐ దాదాపీర్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కదిరి టౌన్: స్థానిక హరిజనవాడ సమీపంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, 1,440 టెట్రా ప్యాకెట్లను కదిరి సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సెబ్ ఇన్‌స్పెక్టర్ రామమోహన్ వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన సెబ్ సిబ్బంది మంగళవారం హరిజనవాడ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తూ షేక్ షాహినా అలియాస్ భవాని, గంగాదేవి పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కటింగ్ చేయించుకోలేదని విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి, బంధువులు

ఎన్పీకుంట: తలవెంట్రుకలు పెరిగి పోయి, అపరిశుభ్రంగా ఉన్న విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు దండిస్తూ ఎందుకు కటింగ్ చేయించుకోలేదంటూ కొట్టడం వివాదాస్పదమైంది. వివరాలు.. ఎన్పీకుంటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈటె హేమంత్‌కుమార్ హెయిర్ కటింగ్ చేయించుకోకుండా, చింపిరి జుట్టుతో మంగళవారం ఉదయం పాఠశాలకు చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రామాంజుల యాదవ్. ఆ విద్యార్థిని పిలిపించుకుని మందలించాడు. హెయిర్ కటింగ్ చేయించుకుని శుభ్రంగా పాఠశాలకు రావాలంటూ కొట్టాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి బంధువులు పాఠశాల వద్దకు చేరుకుని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడితో వాదనకు దిగారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాము కాటుతో యువకుడి మృతి



మృతుడు గోపీనాథ్

గుడిబండ: మండల పరిధిలోని కేకాతి గ్రామానికి చెందిన గోపీనాథ్ (32) పాము కాటుతో మంగళవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గోపీనాథ్ మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్లగా పాముకాటుకు గురయ్యాడు. పలు చోట్ల ఆయుర్వేద మందును తీసుకున్నాడు. అయితే ఆ మందు పాము కాటుకు పని చేయకపోవడంతో సాయంత్రం మడకశిర ప్రభుత్వాస్పత్రికి వెళ్లాడు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతిని భార్య అక్కమ్మను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు.

15 మంది జూదరుల అరెస్ట్

రొళ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామ శివారులో నిర్వహిస్తున్న జూదకేంద్రంపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. 15 మందిని అరెస్టు చేసి రూ.10,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. వీరిని మడకశిర జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొర్రెకు 'సిజేరియన్'



ఆపరేషన్ చేసి గొర్రెపిల్లను వెలికి తీస్తున్న దృశ్యం

శింగనమల: ప్రసవ వేదనతో ఇబ్బంది పడుతున్న గొర్రెకు సకాలంలో సిజేరియన్ ఆపరేషన్ చేసి పిల్లను వెలికి తీసి తల్లి గొర్రె ప్రాణాలు కాపాడిన అరుదైన ఘటన శింగనమల పశువైద్యశాలలో చోటు చేసుకుంది. వివరాలు.. శింగనమలకు చెందిన రామాంజినేయులు, నారాయణస్వామి గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నారు. గర్భం దాల్చి నెలల నిండిన వీరి మందలోని ఓ గొర్రె మంగళవారం ప్రసవం కాక ఇబ్బంది పడుతుంటే వెంటనే స్థానిక పశువైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు గర్భంలోనే పిల్ల మృతి చెందినట్లుగా నిర్ధారించారు. సిజేరియన్ చేసి మృత గొర్రెపిల్లను వెలికి తీస్తే తప్ప తల్లి గొర్రె ప్రాణాలు దక్కవని కాపర్లకు తెలిపి ఆపరేషన్‌కు చర్యలు తీసుకున్నారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ పద్మనాభం, డాక్టర్ రజియా బేగం, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ చంద్రశేఖర్ దాదాపు అరగంటకు పైగా శ్రమించి మృతి చెందిన గొర్రెపిల్లను వెలికి తీశారు. తల్లి గొర్రె సురక్షితంగా ఉందని ప్రకటించడంతో పశువైద్యులకు కాపర్లు కృతజ్ఞతలు తెలిపారు.